



టెక్సాస్ రాష్ట్రంలో డల్లాస్, హూస్టన్ తో పాటుగా తెలుగు మాట్లాడే ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతము ఆస్టిన్ నగరం. ఇది టెక్సాస్ రాష్ట్ర రాజధాని. ఇక్కడ టెక్సాస్ స్టేట్ క్యాపిటల్ భవనం ఉంది. దీనిలో ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహిస్తారు. టెక్సాస్ ను సిలికాన్ హిల్స్ అని పిలుస్తారు. ఎందుకనగా టెక్నాలజీ సంస్థలు. స్టార్ట్ ప్ లు, బయోటెక్నాలజీ మరియు ఔషధ తయారీ సంస్థలు ఇక్కడ అధికంగా ఉన్నాయి. దీని కారణంగా మన తెలుగు రాష్ట్రాల నుండి ఇంజనీర్లు మరియు టెక్నాలజీ నిపుణులు, ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉండుటవలన ఇక్కడ స్థిరపడుతున్నారు. ఆపిల్, డెల్ టెక్నాలజీస్, ఐబీఎం, గూగుల్, టెస్లా వంటి టెక్నాలజీ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. ఆస్టిన్ ను "లైవ్ మ్యూజిక్ క్యాపిటల్ ఆఫ్ ద వరల్డ్" అని అంటారు. అనేక సంగీత ప్రదర్శనలు, ఫెస్టివల్స్ ను ఇక్కడ నిర్వహిస్తారు. అమెరికాలో వేగంగా అభివృద్ధి చెందే నగరాల్లో ఆస్టిన్ ఒకటి. ఇది ఒక సుందరమైన నగరం. ఇది సాంకేతిక, సాంస్కృతిక రంగాలలో అగ్రగామిగా నిలిచింది. ఇక్కడ అనేక ఆకర్షణీయమైన ప్రదేశాలు ఉన్నాయి. ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ ఎట్ ఆస్టిన్ వంటి గొప్ప విద్యాసంస్థలు ఇక్కడ ఉన్నాయి. తానా- ఉత్తర అమెరికా తెలుగు సంఘం,%ఏజాూ%- తెలుగు కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ ఆస్టిన్ సంస్థలు తెలుగు సాహిత్యము, నృత్యము మరియు సాంస్కృతిక పోటీలను ఇక్కడ నిర్వహిస్తారు. విదేశీ గడ్డపై కూడా తెలుగు భాషకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు.

# అందమైన నగరం ఆస్టిన్



ఆస్టిన్ నగరాన్ని చూడటానికి నేను, నా శ్రీమతి జంధ్యం మాధవి జెట్ బ్లూ ఎయిర్లైన్స్ లో ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసుకుని బోస్టన్ లోని లోగాన్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ నుండి ఆస్టిన్ కు బయలుదేరి వెళ్ళాము. నాలుగు గంటల 50 నిమిషాలు ప్రయాణించి ఆస్టిన్ బెర్గ్ స్ట్రోమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నాము. అక్కడి నుండి డౌన్ టౌన్ ఆస్టిన్ కు ఉత్తరాన 18 మైళ్ల దూరంలో ఉన్న రౌండ్ రాక్ అనే నగరానికి మా కోడలు సంధ్య మరియు సతీష్ వాళ్ళ కారులో ఇంటికి చేరుకున్నాము. మరుసటి రోజు ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ ముగించుకొని గంటన్నర పాటు ప్రయాణించి 96 మైళ్ళ దూరంలో ఉన్న శాన్ ఆంటోనీయో మరియు షాప్స్ రివర్స్ సెంటర్ కు కారులో చేరుకున్నాము.

టెక్సాస్ రాష్ట్రంలో అతిపెద్ద చారిత్రాత్మక ఆకర్షణీయమైన నగరము శాన్ ఆంటోనియో. శాన్ ఆంటోనీయో రివర్ వాక్ మరియు ద అలమా ప్రసిద్ధ పర్యాటక ఆకర్షణలకు పేరుగాంచినవి. ఇది అందంగా ప్రకృతి దృశ్యాలతో కూడిన వాటర్ ఫ్రంట్. రెండున్నర మైళ్ళ విస్తీర్ణంలో ఏర్పడింది. ఇక్కడ అత్యంత అద్భుతమైన రెస్టారెంట్లు, నైట్ క్లబ్బులు, బార్లు, షాపింగ్ సెంటర్లు ఉన్నాయి. నగర మధ్యలో ప్రవహించే నది చుట్టూ నిర్మించిన రివర్ వాక్ చాలా ప్రసిద్ధి చెందినది. నదిలో పడవ ప్రయాణం అద్భుతంగా ఉంటుంది. లేదా కాలినడకన కూడా నది అందాలను, కట్టడాలను తిలకించవచ్చును.

ద షాప్స్ ఎట్ రివర్స్ సెంటర్ అనునది శాన్ ఆంటోనియో లోని ప్రసిద్ధ రివర్ వాక్ పక్కనే ఉన్న ఒక పెద్ద షాపింగ్ మాల్. దీనిలో 100కు పైగా షాపులు,రెస్టారెంట్లు, సినిమా థియేటర్లు, ఒక ప్రముఖ హోటల్ మారియట్ రివర్స్ సెంటర్ ఇక్కడే ఉంది. మాల్ లోనికి ప్రవేశించి అక్కడ దుకాణాలను సందర్శించి షాపింగ్ చేసుకున్నాము. రెస్టారెంట్లో లంచ్ ముగించుకొని బయటకు వచ్చి రివర్స్ సెంటర్ మాల్ దగ్గరలో ఉన్న కౌంటర్లో మనిషికి 14 డాలర్లు చొప్పున చెల్లించ" గో రివర్ క్రూయిస్ రివర్ బోటు" దగ్గరికి చేరుకున్నాము. బోటు ప్రయాణం 35 నిమిషాల పాటు ఆనందంగా సాగింది. ఈ పడవలో ఉన్న గైడ్ నదికి చుట్టూ ఉన్న చారిత్రాత్మక భవనాలు, ప్రాచీన కట్టడాల గురించి వివరంగా తెలియజేశారు. ఈ పడవ ప్రయాణం మమ్మల్ని రివర్ వాక్ వెంబడి నగరంలో చారిత్రాత్మక నిర్మాణల గుండా తీసుక వెళ్ళింది. ఇది ఒక మరపురాని అనుభవం. నది గుండా ప్రయాణిస్తున్నప్పుడు రెండు వైపులా ఉన్నటువంటి హోటళ్లు, రెస్టారెంట్లు,అనేక బహుళ అంతస్తుల భవనాలు ఎంతో అద్భుతంగా అందంగా కనిపించాయి. బోటు ప్రయాణం తర్వాత నది ఒడ్డున నడుచుకుంటూ అక్కడ ఉన్న రెస్టారెంట్లో కాసేపు విశ్రాంతి తీసుకుని బయలుదేరాము. తదుపరి ఆస్టిన్ నగరంలో ఉన్న పర్యాటక ఆకర్షక ప్రాంతమైన లేడీ బర్డ్ లేక్ సమీపంలో ఉన్న మౌంట్ బోనెల్ కుచేరుకున్నాము.గతంలో టెక్సాస్ కమిషనర్ గా పనిచేసిన జార్జ్ బోనెల్ పేరున ఈ కొండకు మౌంట్ బోనెల్ అని పేరు పెట్టారు. ఇది సముద్ర మట్టానికి 775 అడుగుల ఎత్తులో ఉంది. దీనిపై నుండి ఆస్టిన్ నగరమును మరియు చుట్టుపక్కల కొండల యొక్క అద్భుతమైన, విస్తృత దృశ్యాలను చూడవచ్చును.

సూర్యాస్త సమయం చూడడానికి ఇది చాలా మంచి ప్రదేశము. ఈ కొండ ఉన్న ప్రాంతాన్ని కవర్ట్ పార్క్ అని అంటారు.కొండపైకి సుమారు 102 రాతి మెట్లు ఎక్కి మరియు కొంత భాగము కాలినడకన ప్రయాణించి చేరుకున్నాము. ఈ కొండ పైనుండి ఆస్టిన్ నగరము మరియు ప్రక్కనే ప్రవహిస్తున్న కొలరాడో నది మరియు చుట్టుపక్కల కొండల యొక్క అద్భుత దృశ్యాలను వీక్షించాము. ఇక్కడ ప్రముఖ తెలుగు సినిమా ఫిదాలోని "ఏదో జరుగుతోంది" పాటలోని కొంత భాగాన్ని ఈ మౌంట్ బోనెల్ ప్రాంతాల్లో చిత్రీకరించారు. అందుకే తెలుగు ప్రజలకు ఈ ప్రాంతము మరింత ప్రత్యేకంగా ఆకర్షణగా మారింది. తదుపరి కవర్ట్ పార్కులోనికి చేరుకొన్నాము.ఈ ప్రాంతాన్ని 1939లో కవర్ట్ కుటుంబం నగరానికి విరాళంగా ఇచ్చింది. అందుకే దీనిని కవర్ట్ పార్క్ ఆస్టిన్ అని అంటారు. అక్కడ ఉన్న అందమైన పూల మొక్కలు, ఓక్, సెడార్ వృక్షాలు మరియు నెమళ్ల పార్కును వీక్షించాము. ఇక్కడ చాలా నెమళ్ళు ఉన్నాయి.కవర్ట్ పార్క్, మౌంట్ బోనెల్ రెండు కూడా పర్యాటక మరియు సహజ సౌందర్య కేంద్రాలు. ప్రకృతి ప్రేమికులకి, అందమైన దృశ్యాలను చూడడానికి, సూర్యాస్త సమయాన్ని ఆస్వాదించడానికి ఇది అత్యుత్తమమైన ప్రదేశం.

మౌంట్ బోనెల్ నుండి కొంత దూరంలో నగరంలో దక్షిణాన లేడీ బర్డ్ లేక్ ఉంది. ఇది ఆస్టిన్ నగరం గుండా ప్రవహించే కొలరాడో నదిపై నిర్మించబడిన అద్భుతమైన ఒక కృత్రిమ సరస్సు. ఇది బోటింగుకు, కయాకింగ్, పెడల్ బోటింగ్ వంటి నీటి క్రీడలకు అనుకూలంగా ఉంది. కాలినడకన కూడా ప్రయాణించవచ్చు. లేడీ బర్డ్ లేక్ లో జరిగే అత్యంత అద్భుతమైన సాహస బోటు యాత్రను కయాక్ టూర్ అంటారు. ఈ పర్యటన సూర్యాస్త సమయంలో డౌన్ టౌన్ ఆస్టిన్ స్కైలైన్ వెంట కయాక్ అను చిన్న పడవలో ప్రయాణం ప్రారంభమవుతుంది. మన వెంట టూర్ గైడ్ కూడా వస్తారు. పడవలో వెళ్తున్నప్పుడు ఆస్టిన్ స్కై లైన్ ను వీక్షించవచ్చును. సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కాంగ్రెస్ అవెన్యూ బ్రిడ్జ్ కింది నుండి లక్షల సంఖ్యలో మెక్సికెన్ ఫ్రీ టైల్డ్ గబ్బిలాలు ఆహారం కొరకు బయటకు వచ్చి అద్భుతంగా ఒక క్రమంలో ఎగిరిపోతాయి. వీటిని చూసే సాహసం కూడా కావాలి. నిజంగా ఇది ఒక ప్రసిద్ధ పర్యాటక అనుభవంగా మిగిలిపోయింది. ఇంటికి వెళ్లే సమయంలో ఆకాశ హర్మ్యాలలో లైట్లు వెలిగినప్పుడు ఎంతో సుందరంగా కనిపించింది. నిజంగా మరపురాని దృశ్యాలు కనపడతాయి. ప్రకాశమంతమైన కాంతులు, గబ్బిలాలు మమ్మల్ని మంత్ర ముగ్దులను చేశాయి.

మరుసటి రోజు బ్రేక్ ఫాస్ట్ ముగించుకొని ఆస్టిన్ డౌన్ టౌన్ లోనున్న అద్భుత నిర్మాణ కళాఖండం "టెక్సాస్ క్యాపిటల్" (టెక్సాస్ రాష్ట్ర అసెంబ్లీ) భవనాన్ని సందర్శించాము. ఇది అమెరికాలోని రెండవ అతిపెద్ద రాష్ట్ర అసెంబ్లీ భవనము. దీనిని పింక్ గ్రానైట్ రాళ్లతో 1988లో నిర్మించారు. ఇది 22 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. 95 మీటర్ల ఎత్తులో, నాలుగు అంతస్తులలో నిర్మించారు. దీనిని ఉచితంగానే సందర్శించవచ్చును. దీనిలో టెక్సాస్ గవర్నర్ కార్యాలయము, అసెంబ్లీకి కావలసిన ఆధునిక గదులు, చాంబర్లు, సుప్రీంకోర్టు, లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ వంటి ముఖ్యమైన సంస్థలు ఉన్నాయి. భవనం పైన ఉన్న ఎత్తైన గోపురంలో గాడెస్ ఆఫ్ లిబర్టీ అను విగ్రహం చూపరులను ఆకట్టుకుంది. ఇది డోమ్ పైభాగంలో శోభాయమానంగా ఉంది. క్యాపిటల్ విజిటర్ సెంటర్ లోని అనేక గదులలో టెక్సాస్ చరిత్ర మరియు ప్రభుత్వాన్ని గురించి తెలియజేసే చాలా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఒక గంట సేపు క్యాపిటల్



గ్రౌండ్ ప్రాంతంలో కాలినడకన ప్రయాణించి అక్కడి అందమైన కట్టడాలను వీక్షించాము. ఆవరణలో అనేక శిల్పాలు, యోధుల స్మారక చిత్రాలు కనిపించాయి.

దీనికి కొద్ది దూరంలో బుల్లక్ టెక్సాస్ రాష్ట్ర చరిత్ర మ్యూజియం (Bullock Texas State Museum) ఉంది. దీనిని బుల్లెట్ మ్యూజియం అని కూడా అంటారు. టెక్సాస్ 38వ లెఫ్టినెంట్ గవర్నర్ అయిన బాబ్ బుల్లక్ పేరు మీద ఏర్పాటు చేయబడింది. ఇది టెక్సాస్ యొక్క చరిత్రను, ప్రజల సంస్కృతిని తెలియజేస్తుంది. ఆదివారము రోజు కాబట్టి మాకు ఉచిత ప్రవేశం లభించింది. మ్యూజియంలో మూడు అంతస్తుల్లో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తు స్థానిక అమెరికన్ నాగరికతలను మరియు యూరోపియన్ వలసల గురించి తెలియజేస్తుంది. రెండవ అంతస్తులో టెక్సాస్ విప్లవము, సివిల్ వార్ సంఘటనను తెలియజేసే ప్రదర్శనలు ఉన్నాయి. మూడవ అంతస్తులో ఆధునిక టెక్సాస్ చరిత్రను, అంతరిక్ష పరిశోధన మరియు పౌర హక్కుల ఉద్యమాన్ని తెలియజేసే ప్రదర్శనలు ఉన్నాయి. దీనిలో ఒక పెద్ద "టెక్సాస్ స్పిరిట్ థియేటర్" అను ప్రత్యేక థియేటర్ ను ఏర్పాటు చేసి టెక్సాస్ చరిత్రకు సంబంధించిన కార్యక్రమాలను ప్రదర్శిస్తారు. ఇక్కడ ఐ మాక్స్ థియేటర్ కూడా ఉంది. దీనిలో 2D మరియు 3D చిత్రాల పాటు కొత్త చిత్రాల ప్రీమియర్లు ప్రదర్శించబడతాయి.

అక్కడినుండి మేము యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ ఎట్ ఆస్టిన్ (University of Texas at Austin) కు చేరుకున్నాము. ఇది అమెరికాలో అత్యంత ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయం. ఇది 400 ఎకరాలలో విస్తరించి ఉంది. దీనిలో 18 కాలేజీలు,90 పైగా పరిశోధనా కేంద్రాలు ఉన్నాయి. 50 వేల మందికి పైగా విద్యార్థులు దేశ విదేశాల నుండి వచ్చి ఇక్కడ చదువుతున్నారు. ఇందులో మన భారతీయులు చాలామంది ఉన్నారు. ఇది ఒక ప్రభుత్వ పరిశోధనా విద్యాలయము. అమెరికాలో ఉన్నత విద్యకు, విస్తృత పరిశోధనలకు ఒక ప్రముఖ కేంద్రం. దీనిలో ముఖ్యంగా ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, న్యాయ శాస్త్రము, బిజినెస్ మేనేజ్ మెంట్, ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్సెస్, ఎడ్యుకేషన్, ఫైన్ ఆర్ట్స్ వంటి విభాగాలలో చక్కటి అవకాశాలు ఉన్నాయి. అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ ప్రోగ్రాములు, వివిధ రంగాలలో అనేక కోర్సులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ యూనివర్సిటీ లో సీటు సంపాదిస్తే మన తెలుగువారు ఎంతో గర్వంగా ఫీల్ అవుతారు. బహుళ అంతస్తుల భవనాలను వీక్షించి తిరుగు ప్రయాణమయ్యాము. అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీ ని చూసే అవకాశం మాకు కలిగినందుకు ఎంతో సంతోషించాము. సాయంత్రం రౌండ్ రాక్ నుండి బయలుదేరి ఆస్టిన్ విమానాశ్రయానికి చేరుకొని ముందుగా సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్ లో బుక్ చేసిన ఫ్లైట్ ద్వారా బోస్టన్ లోని లోగాన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తిరిగి చేరుకున్నాము. మా ప్రయాణం ఎంతో అద్భుతంగా, ఆనందకరంగా జరిగింది.


వ్యాసకర్త
డా. జంధ్యం మధూకర్
విశ్రాంత ఉపన్యాసకులు
2-7-351/1,
అపార్ట్మెంట్ నం 303
మారుతి హైట్స్, ముకరంపుర
కరీంనగర్-505001
Mobile: 9912127591










